

# వలస

## ఇనాయతుల్లా

"కరిడికొండకు బస్సెప్పుడొస్తుంది తాతా?"
పాత కళ్లద్దాలను సవరించుకుంటూ, ఆరిపోతున్న స్టవ్‌కు పంపు కొడుతూ 'టీ'ని కలియబెడ్తున్న ఆ తాత నేను ప్రశ్నడిగిన కొద్దిసేపటికి తలపైకెత్తి చూశాడు. నేనడిగిన ప్రశ్న అతనికి చాలా విచిత్రంగానూ వింతగానూ తోచినట్లుంది. చూపుడువేలుతో అద్దాల్ని సవరిస్తూ...

"యావూరు సారూ మనది?" అన్నాడు.

ప్రశ్నకు ఎదురుప్రశ్న వేసినందుకు నా ఇగో కొంచెం దెబ్బతినింది. ఇన్‌షర్టును ఇంకొంచెం సర్దుకుంటూ, 'కర్నూలు,' అన్నాను. "కరిడికొండకు బస్సు రాదు సారూ. కొంచేపు కుచ్చో. వ్యాను యిట్ట లోనికి పోయింది. మల్ల తిరిగొత్తాది. దానికి పోదువుగాని," అన్నాడు.

ఆ హోటల్‌లో పాత తడికెలు, తడికెల నిండా సినిమా బొమ్మలు, బండలతో కట్టిన అరుగులు విశ్వం చెప్పే మాటలు గుర్తొచ్చినాయి నాకు. నువ్వు మా వూరికి వెళ్లే రోడ్డు మీద దిగీ దిగంగానే ఒక మల్టీస్టార్ (అంటే అన్ని సినిమా హీరోల బొమ్మలుండే) హోటల్ నీకు స్వాగతం పలుకుతుంది. దానిలో ఉండేది అన్నీ సిల్వర్ గిలాస్‌లేగాని దాని పేరు మాత్రం 'మహాలక్ష్మి విలాస్' అని అతడు తన ఊరి గురించి చెప్పిన జోకులు ఒకసారి మళ్లీ నెమరేసుకున్నాను. హోటల్‌లో కూర్చున్న వాళ్లలో ఒకరిద్దరు తప్ప ఒంటి మీద అంగీలు తొడుక్కున్నవాళ్లు ఎక్కువమంది లేరు. ఒకాయన మాత్రం అక్షరమక్షరం అతి కష్టమ్మీద కలుపుకొని పేపర్లో వార్తలు చదువుతుంటే చుట్టూ కూచున్నవాళ్లు టీ చప్పరిస్తూ వింటున్నారు. కొంతమంది పిల్లలు పేపర్లలోని సినిమా పేజీల మీద పడి మాట్లాడుకుంటున్నారు.

"వా! ఇక్కడ సూడిలె బాలకిస్న బొమ్మ. ఆ మీసం కట్టు, ఆ డ్రస్సు సొయ్యం మన రొడ్డి లెక్కనే ఉన్నడు. సూపర్ ఉందంటే ఈ సిలిమ," మాట్లాడుకుంటున్నారు పదైదు పదారేళ్ల పిల్లలు. ప్రక్కన సద్దులు పెట్టుకున్నారు. గొండా పనిచేసేవాళ్ల లాగున్నారు.

టీ తాగుదామనుకున్నా కాని యిక్కడ టిఫిన్ ఏముంటుందో కాస్త వెరైటీగా తిందామనుకొని, "టిఫిన్ ఏమైనా ఉందా తాతా!" అడిగాను.

"ఇంత ఎండపన్యాంక టిఫిన్ ఉండత్సారూ! ఇంగ లేటైనంక దొరికేది టీ ఒగటే," అన్నాడు.

"సరే టీ యిచ్చేయ్," అన్నాను.

"ఏమో సామీ మీ పట్నమాసమోల్లకు మా టీ నచ్చుతాదో లేదో తాగి సూడు," అంటూ టీ గ్లాసిచ్చాడు ఆ హోటల్ కుక్, సప్లయర్ కం ప్రొప్రెయిటర్ అయిన తాత.

"ఎవురింటికి పోవల్ల సారూ?" అడిగాడు.

"వెంకట సుబ్బారెడ్డి ఇంటికి," అన్నాన్నేను.

అదేమిటోగాని అంతవరకూ మామూలుగా పలకరించిన తాత వెంటనే, "కూచ్చోసారూ... రేయ్ జర్గండిరా. మీకు పొద్దుమూకులు సిలిమ బొమ్మలే. ఇంగ పనికిపొండి," అంటూ గొండాపిల్లల్ని పక్కకి పంపి తన వల్లెతో అరుగుమీది దమ్ము దులిపినాడు.

''రొడ్డింటికొ్యా సామి,'' పక్కనే టీ తాగుతున్న మరొకాయన అడిగాడు. అవునన్నాను తాత చూపించిన అరుగు మీద కూర్చుంటూ.

''పెదరొడ్డి కోసమా- చిన్రెడ్డి కోసమా సామి,'' అడిగాడింకొకాయన టీ గ్లాసు ప్రక్కన పెడుతూ.

''వెంకట సుబ్బారెడ్డింటికి,'' అన్నాన్నేను ఆ చిన్నా పెద్ద ఎవరో తెలియక.

''ఆ! అంటే పెదరొడ్డేలే. నేనొచ్చేతపుడు ఉండ్యె. అలారుదిన్నె మాదిగోల్లది పంచ్యాతి చెప్తుండె. ఆపీసర్లు గూడ శానామంది కూసోనుండ్రి. మన పత్తికొండ ఎస్సై ఆలపరెడ్డి గూడ ఉండె. యియాలేందో జనమబూమి మీటింగుందని మాట్లాడుకుంటుండ్రి,'' చెప్పుకుపోతున్నాడా ఊరతను.

'ఆలపరెడ్డి' పేరు విని ఆశ్చర్యపోయాను. హైబ్రిడ్ జొన్నలను 'అయ్యపరెడ్డి' జొన్నలన్నట్లు 'ఆల్‌ఫ్రెడ్'ను ఆలపరెడ్డిగా మార్చింటారనుకున్నా.

''రొడ్లోల్లేనా సారు మీరు గూడ?'' ఒకాయన దగ్గరగా వచ్చి అడిగాడు.

''కాదు. నేను విలేఖరి... ఆయనతో పనుండి వెళుతున్నా,'' అన్నాన్నేను.

ఇంతలో, 'వచ్చ్యె- వచ్చ్యె' శబ్దాలు. ''యియ్యాల బలేటు కొట్టుకొచ్చినాడ్రా. ఎవరు డ్రైవరు?''

''వాడు బండ సంజన్న కొడుకు సింపిరినెత్తి శీనుగాడు.''

''ఆ! వాడైతే మోత మోగిస్తడులే బండిని, ఇగో నాలుగు సీటీలు పట్టు.''

ఈ మాటల్ని పట్టి నేనెక్కాల్సిన వ్యాను రాబోతుందని గ్రహించాను. గబాగబా టీ త్రాగేసి తాతకి చిల్లరివ్వబోయాను. తాత డబ్బులు తీస్కోలేదు. బయటికెళ్లి వ్యాను కోసం చూశాను. అక్కడెక్కడో వో టర్నింగ్ దగ్గర వస్తున్నట్లుంది. చెట్ల మధ్యలోంచి దాని టాప్ మీద కూర్చున్న జనమే కనిపిస్తున్నారు తప్ప వ్యాను కనిపించలేదు. దగ్గరగా వచ్చింది. దాని టైర్లు స్టీరింగ్ తప్ప మరే పార్టు కనపడకుండా మొత్తం జనమే ఎక్కారు. జనం దిగుతున్నారు. కరిడి కొండ మట్టంతా దులిపేస్తున్నారు. వ్యానులో నుండి దిగుతున్నవాళ్లలో సగంమందికి పైగా పెద్దపెద్ద మూటలతో సామాన్లతో దిగుతున్నారు. చంకలో పిల్లలు, కొంచెం పెద్ద పిల్లల చేతుల్లో చేటలు, బిందెలు, బకెట్లు కనిపించాయి.

''పదిమందికి ముప్పైరూపాయలా కుదరదు. త్యా యాభై రూపాయలీ,'' వ్యాను డ్రైవరు గట్టిగా అరుస్తున్నాడు.

''యాదోలే సామీ. బతకనీక పోయేతోల్లం. కొంచెం సూసి తీస్కో అంతగా అయితే గుంటూరు పనికి పోయొచ్చినంక యిస్తాములే,'' అంటూ బ్రతిమాలుకుంటుంది ఒకామె.

''సంచులల్లో దాసిపెట్టింటరు దుడ్లుతీ,'' అరుస్తున్నాడు డ్రైవరు. ఒక ముసలామె బొడ్డులో దోపుకున్న చిన్న సంచీలో నుండి మడతలు పడిన నోట్లు తీసింది. వీళ్లందరూ గుంటూరుకు పనికి పోతున్నారని తెలిసి ఆశ్చర్యమేసింది. చూస్తున్నంత లోపే మళ్లీ ఫుల్లైపోయింది వ్యాను. కొత్త సినిమా టికెట్ల సంబరమే మళ్లీ యిక్కడ కనిపించింది నాకు. ఆ కసరత్తు చేయడం చేతకాని నేను వ్యాను ముందు అటూఇటూ తిరుగుతూ బయటే మిగిలిపోయాను.

''సార్! సార్,'' డ్రైవర్‌కు ఎడమ ప్రక్కన కూర్చున్న తను కేకేసి పిల్చాడు. ఇందాక హోటల్లో నన్ను పలకరించినతను. ''రొడ్డోల్లింటికి పోతున్నడంట కూచోపెట్టుకో,'' అంటూ, ''రా సార్ నేను పైకి పోతాలే.'' నేను వద్దంటున్నా లాగి కూచోపెట్టాడు. సరే కూచున్నాను. ఆగిపోతుందేమో అన్నంత నిదానంగానూ, దెబ్బకు కరిడికొండలో పడుతుందేమో అన్నంత స్పీడుగానూ పోవటం ఆ వ్యానుకే చెల్లు. జన్మభూమిలో బెస్ట్ పంచాయితీగా ఎంపికైన కరిడికొండ రోడ్డు మహత్యం నా నడుములకు బాగా తెలిసొచ్చింది. '12 గంటల్లో అంగన్‌వాడి పాఠశాల నిర్మాణం', '24గంటల్లో రోడ్డు నిర్మాణం', 'జన్మభూమిలో కరిడికొండ ముందంజ' అంటూ పేరుమోసిన పత్రికల్లో బాక్సులు కట్టి రాసిన వార్తల్లోని వాస్తవాలు ఒక్కొక్కటి నాకు అర్థమవుతున్నాయి. అయితే వెంకటసుబ్బారెడ్డితో ప్రత్యేక ఇంటర్వ్యూ చేయమని నన్ను పంపిన 'జనవాణి' మేనేజ్‌మెంట్ నా రిపోర్ట్‌కు ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి. ఇంతలో ఒక మలుపు దగ్గర సడన్ బ్రేకు. అవతల నుండి వరుసగా జీపులు. ఆమధ్య ఒక టాటాసుమో. ఒక ట్రాక్స్

''అగో! అగో! పెదరొడ్డి నడుంగల గూసున్నాడు.''

ఏం! సంగనోట్టు జీపులొచ్చేవియాల.

యియాల దేవనకొండలో మీటింగ్.

''ఎవరుత్సుండరో...''

''ఇంగవరెరొత్సరిలే! మన రొడ్డే. జన్మభూమి మీటింగ్ జెప్తడంట యియ్యాల. కటారుకొండ, దూదికొండ, అలారుదిన్నె ఈ పల్లెల్లోల్లంత కలిసి 150 కేజీల దండ సేపిత్సుండ్రి నిన్న.''

వ్యానులో... జనం గుసగుసలు.

జీపులు, టాటాసుమో, ట్రాక్స్... ఒకదాని వెనుక ఒకోటి మా వ్యాను ముందర నుండి వెళ్లిపోయాయి. ఆ వాహనాలన్నింటి మీద 'బైసాని' అని పెద్దక్షరాలతో రాసి ఉంది. జులపాలు, బవిరిగడ్డాలు, పెద్దపెద్ద మీసాల వందిమాగధులు జీపుల నిండా ఇరుక్కోని, వ్రేలాడుకొంటూ రెడ్డికి రక్షణగా వెళ్లడం... అదొక వైభవం. ఆ జీపుల కీ కీక్ శబ్దాల మోత కాసేపు ఆ వాతావరణాన్ని నిశ్శబ్దపర్చింది. నేనొచ్చిన పనికి బ్రేకు పడింది. అయినా ఊళ్లో విశ్వనాథం ఉన్నాడు కదా. చాలారోజుల్నించి ఊరికి రమ్మని పిల్చిపిల్చి విసిగి పోయాడు. ఈ ఇంటర్వ్యూ సాకుతోనైనా ఒకరోజు వాడింట్లో ఉండిపోయి ఉదయాన్నే పని చూసుకోవచ్చు ననుకున్నా. రోడ్డు కిరువైపులా నవ్వుతున్న నాపచేన్లు. పండుతున్న పచ్చచేలు అక్కడక్కడా విసిరేసినట్టు కని పిస్తున్నాయ్. మళ్లీ మాట్లాడుతున్నారు వ్యానులో జనం.

"ఎవర్దిరా ఈ జొన్నసేను కంకులు శానా అద్వా న్నంగుండయ్."

"ఇద్యా. నేసె రామునిది. బలిజ రంగన్న కాడ గుత్తకు దీస్కోని ఏస్కోండడు. అది ఇంత అవతారంగ వచ్చింది."

"ఏమో... ఈ యేడు రైతల్కి శానా శని పట్టు కొంది. శనిక్కట్టి సేతికి రాకపాయె. కందికట్టె కాటికి పాయ అన్నట్టుంది. ఒరెనీ! కంకి కాలపెట్ట. మా కాలం లో కంకి సూడాలట్లే. కొయ్యనీక పోతే కొడేలికి తిరగ బడ్తుండె. పొద్దున సంగటి తిని పత్తికొండ సంతకు పోతే మల్లసగరు బొద్దుదంక ఆకలైతుండ్ల్యా." వ్యానులో కూర్చున్న వాళ్ల మాటలు వింటుంటే కొత్త పుస్తకం చదివి నట్లుంది నాకు.

ఇంతలో దిగర్రి దిగర్రి. ఊరొచ్చింది. అన్నాడు డ్రైవరు. జనం దిగుతున్నారు. నా దగ్గర డబ్బు తీస్కో న్నాడు డ్రైవరు. సరే, దిగి కొంచెం ముందుకు కదిలాను. మర్రిమాను కింద రచ్చకట్ట. పులిజీతం ముగ్గు రాడుతున్నారు. చుట్టూ జనం మూగారు. నేను దగ్గిరగా వెళ్లి, "విశ్వనాథం యిల్లెక్కడ?" అన్నాను.

పులిజీతం ఆడుతున్నవాళ్లు సడన్‌గా నావైపూ నా బ్యాగువైపూ చూశారు. ఒకాయనేమో, "ఎవరూ! యిస్ప నాగం... అట్టాటి పేరుండేటోడు ఈ వూర్లోనేలేడే," అన్నాడు.

లేడా! ఆశ్చర్యపోయాను. క్షణం ఆగి... అతను, "తిరుపతిలో చదువుకొని ఈమధ్యనే ఊరికి వచ్చి వుంటున్నాడు," అన్నాను.

ఏంటోల్ల పిల్లోడు?

కులం! యిద్దరం కలిసి రూంలో ఉన్నాంగాని అది నేనెప్పుడూ అడగలేదు. విశ్వనాథం చెప్పలేదు. మరొకాయన దగ్గరగా వచ్చి, "వో! అవులే... తెలుగోల్ల పిల్లోడు కదా. గంజి నాగన్న కొడుకు... కాశిగాడు." "రేయ్ ఇక్కర్రారా!" అంటూ గోలీలాడుతున్న వాళ్లలో ఒకన్ని పిల్చి, "మీకు పర్యేటు చెప్తాడు సూడు తెలుగు గేర్లో- వాయన ఇల్లుజూపీ," అన్నాడు. "థ్యాంక్స్..." "సారీ..." కొన్ని అర్బన్ పదాలు అలవాటుగా వాడాను. వాళ్లు అదోమాదిరిగా చూస్తుంటే వాటికి ట్రాన్స్‌లేషన్ చేతకాక- మంచిది... వస్తా అంటూ ఆ పిల్లవాడి వెంట నడిచాను.

"బుర్ర్.... కీక్..." అంటూ రెండు చేతుల్తో ఆ పిల్లాడు స్టార్ట్ చేసిన ఉత్తుత్త బగ్గీతో ముందు పరిగెడు తున్నాడు. బండపరుపు ఉన్న గల్లీలోని ఒక ఇంట్లోకి పోయి మళ్లీ పరుగెత్తుకొచ్చాడు. విశ్వనాథం అలియాస్ కాశిగాడు అడ్డపంచె దించుతూ గబగబా వచ్చాడు. "హలో! హలో! అబ్బబ్బ! ఎన్నాళ్లకు జరిగింది నీ దర్శనం," కాశి చేతులు కలుపుతూ నన్ను రిసీవ్ చేసు కున్నాడు.

సంచి ఓ మూలనపెట్టి, "మొత్తానికి దొరికావు. ఉండవేమో అనుకుంటూ వస్తున్నా."

"నేనా... నిన్ననే చేరింది నీ ఉత్తరం... వేరే ప్రోగ్రాం ఉన్నా నీ కోసం ఆగిపోయా," అంటూ చెంబులో నీళ్లం దించాడు కాశి. కాళ్లు మొహం కడుక్కోని పంచె, బనీను లో దిగిపోతే అప్పుడు కాస్త హాయిగా అనిపించింది. అరుగు మీద కంబడి పరిస్తే వ్యానులో ఉతకబడిన శరీరాన్ని అక్కడ ఆరేశాను. ఉద్యోగ సోపానాలు, ఎంప్లాయ్‌మెంట్ న్యూస్, గ్రూప్ 1, గ్రూప్ 2, పుస్తకాలు కాశి పుస్తకాల గుట్టలో కనిపిస్తున్నాయి.

"ఓహో! కాశీ! త్వరలో ఆఫీసరయ్యే లక్షణాలు నీలో తన్నొచ్చినట్లు కన్పిస్తున్నాయ్. ఏ డిపార్ట్‌మెంట్ సెలెక్ట్ చేసుకున్నావేమిటి?" చాలారోజుల తర్వాత కాశితో జోకులు మొదలుపెట్టాను.

"డిపార్ట్‌మెంటా పాడా! ప్రస్తుతానికి గృహము, వ్యవసాయశాఖ వెలగబెడ్తున్నాను. అయినా నాకీ తంటాలు తప్పవు. నీలాగా జనవాణి, యువవాణిలో పనిచేసే టాలెంట్లు మాకు లేవు గదబ్బా. ఎవని గడ్డమో, కాలో పట్టుకొని ఉద్యోగం సంపాయించుకోకపోతే ఈ పల్లెల్లో బత్కలేం." కాశీకి చదువు, ఉద్యోగం, పెళ్లి... చక్రంలో రెండవ మజిలీ కోసం వెంపర్లాడుతున్నాడు.

కాసేపు మళ్లీ పి.జి. కాలేజి రోజులు... హాస్టల్ జీవితం నెమరేసుకున్నాం. నవ్వుకున్నాం. కాశి వాళ్లమ్మ చెంబెడు మజ్జిగ తెచ్చింది. తాగితే కడుపు ఎ.సి. రూంలాగా చల్ల గైంది. భోజనాలయ్యాక కాసేపు సేద తీర్చుకున్నాను.

*

సాయంత్రం ఇద్దరం కలిసి చెర్వుగట్టుకెళ్లాం. హాస్టల్‌రూంలో గోడమీద కవిత్వం గుర్తు చేశాడు కాశి. చెర్వుగట్టు పైని బండి వస్తుంది. బండిలో నుండి బ్రహ్మంగారి తత్వం వినబడుతోంది. చెర్వులో కొద్దిగా నీళ్లున్నాయి. నల్లటి భూమిలో పగుళ్లు వెక్కిరిస్తున్నాయ్.

''ఈ వూళ్లో బావులు, బోర్లు లేవా!'' కాశిని అడిగాను.

''వూర్లో అంతా 10, 15 ఎకరాల రైతులే. ఇద్దరో ముగ్గురో బావులు, బోర్లున్నవాళ్లు. ఎక్కువ కురువ, బలిజ, వడ్డె కులాలున్నాయి. ఒకప్పుడు బోయ బీరప్ప నాయుడు కుటుంబం బాగా ఆస్తిగల కుటుంబం. రెడ్లతో ఫ్యాక్షన్ నడిపి ఇల్లు పొలాలు పోగొట్టుకున్నాడు. అలా చాలా బోయ కుటుంబాలు ఊరు వదిలి వెళ్లి పోయినాయి. ఇప్పుడతని మనుమడు అర్లప్పనాయుడు రెడ్డివైపే ఉండి ఉన్న కొన్ని పొలాల్ని కాపాడుకొని జీవనం సాగిస్తున్నాడు.''

''ఊళ్లో 200 ఎకరాల పొలం ఉంది- బైసానికి.

''బావి, బోరు, ట్రాక్టర్లు - బైసానివి.

''బంగళాలాంటి యిల్లు - బైసానిది.

''మండలాధ్యక్షపదవి - బైసానిదే. దాదాపు బంజారాహిల్స్‌ని ఈ హిల్స్‌లో ప్రత్యక్షం చేయగల దిట్ట బైసాని వెంకట సుబ్బారెడ్డి,'' చెప్పుకుంటూ పోతున్నాడు కాశి.

''అది సరే. మీ ఊళ్లో జన్మభూమి పథకం కింద 100 రోజుల్లో స్కూలు, 12 గంటల్లో అంగన్‌వాడి కేంద్రం కట్టి రికార్డు సృష్టించారట కదా! ఏదీ ఓసారి వాటిని చూద్దాం పద,'' అన్నాను.

''రేపెలాగూ రెడ్డిగారిని కలిసి ఇంటర్వ్యూ చేసే పని ఉందిగదా! ఆయన నీకవన్నీ చూపించి, ఫుల్‌గా బిర్యాని కొట్టించి, ఇంకా ఇంకా.... నీవు జర్నలిస్టుగా ముదిరింటే.... సకల మర్యాదలు చేసి పంపుతాడు...'' కాశి కొంచెం ఎగతాళిగా అన్నాడు.

''ముదిరింటే నీ యింటికొచ్చి మజ్జిగెందుకు తాగుతానువై. మనకంత సీన్‌లేదులే గాని ముందవేవో చూద్దాం పద,'' అన్నాను. ఇద్దరం అక్కడి నుండి కదిలాం. స్కూలు దగ్గరికొచ్చాం. ఇంకా ఫినిషింగ్ పనులు జరుగుతున్నాయి. ''అదిగో ఆపైన నిలబడుకో నున్నాయన వెంకట సుబ్బారెడ్డి తమ్ముడు వెంకట నాగిరెడ్డి.''

ఆయన ఆర్డర్లు జారీ చేస్తున్నాడు. జరీపంచె పైకి కట్టి గంజి పట్టిచ్చిన ఖద్దరంగీ. ముంజేతికి గొలుసు. సిగరెట్ దమ్ము లాగిస్తున్నాడు. కాశి నమస్తే అన్నాడు. ఎడమచేయి కొంచెం పైకెత్తాడు రెడ్డి. మళ్లీ ఆ కూలీలకు పని పురమాయిస్తూ మధ్య మధ్యలో బూతులు తిడ్తు న్నాడు. ఎదురుగానే 12 గంటల్లో కట్టిన అంగన్‌వాడీ కేంద్రం ఉంది. ఊళ్లో గవర్నమెంటు కట్టడాలంటూ ఏవైనా జరిగితే అది ఖచ్చితంగా నాగిరెడ్డికివ్వాల్సిందే. కొంచెం ముందుకు కదిలాం. రచ్చకట్ట పైన చిలక పంచాంగం అందరూ ఆసక్తిగా వింటున్నారు. శివాల యంలో పెట్టిన రామాంజనేయ యుద్ధం పద్యాలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇంటికొచ్చేటప్పటికి సాయంత్రం 6.30 అయింది. కాశీ యింట్లో పిల్లల సందడి. ట్యూషన్ పిల్లలు నిండుకుపోయారు.

''ఓహో! మంచి ఫ్యాక్టరీ నడుపుతున్నావే. సాయంత్రం మంచి కాలక్షేపమే,'' అన్నాను.

''కాలక్షేపమా పాడా! ఈ చీమిడి ముక్కుగాళ్లు, లొడుగుబుడుగు నిక్కరగాళ్లు... వాళ్లకు అ ఆలు, ఎక్కాలు వచ్చేదేమోగాని చెప్పిచెప్పి నాకొచ్చినవి కూడా పోయేటట్టున్నాయ్,'' అన్నాడు కాశి.

''సార్!...'' ఒక పిల్లాడు బనీను, నిక్కరు, మెడలో అంత్రాలు... పలక పట్టుకొని సిగ్గులొలకబోస్తున్నాడు.

''ఓయ్! ఏమిటి అన్ని అంత్రాలేసినవ్,'' అన్నాను నేను.

''వాడు పైపాడు జరమొచ్చి సచ్చిపోతుండె. అంత్రమేసినంక బత్కినాడు,'' వాడి అక్క చెప్పింది. వింతగుంది. ''కాశీ! పైపాడు జరమేమిటదీ!'' అన్నా.

''టైఫాయిడ్ కొచ్చిన తిప్పలది,'' కాశీ చెప్పాక నాకు నవ్వాగలేదు. పదేళ్ల పిల్లవాడు పైనుండి క్రింద వరకు వదులుగా ఉండే బనీను మాత్రమే వేసు కున్నాడు. వంతు ప్రకారంగా వాడి పలక తీస్కొచ్చినాడు. ''ఇదేమిట్రా- ఏమీ రాయకుండా తెచ్చినవ్?'' కాశీ కొంచెం గట్టిగా అరిచాడు. వాడు పలకకుండా చేతులు రెండు కట్టుకొని తల నేలకేసి కనురెప్పలు పైకి పెట్టి చూస్తూ నిలబడినాడు.

''ఓయ్! ఏందట్ల బెల్లం కొట్టిన రాయిలెక్క నిలబడినవ్,'' కాశీ ఇంకొంచెం గట్టిగా అడిగేసరికి వాడు ఏడుపు లంకించుకున్నాడు.

''ఇంటికి పోతా... బువ్వ...'' రాగాలు తీస్తూ ఏడుస్తున్నాడు. పక్కింటి పిల్లాడు అందుకున్నాడు, ''సార్! వాడు పైటాల బువ్వ తినలేదు సార్.''

''ఎందుకు?''... అడిగాను.

''వాల్లమ్మ కూలికిపోయింది. వాల్ల నాయనకు కాల్లు చేతులిర్గినయ్... ఇంగ బువ్వ చేయనీక ఎవ రున్నారు?'' అన్నాడు పక్కనున్న పిల్లవాడు.

''ఏందీ. కాళ్లు చేతులిర్గినయా. ఎట్ల ఇరిగినయ్. కింద పడినాడా...'' కాశి ఆశ్చర్యంగా అడిగాడు. ''లేదు సార్....'' అంటున్నారు గాని పిల్లలెవ్వరూ పల్కడం లేదు. ఆ పిల్లవాడు కట్టుకున్న చేతుల్తో ముక్కు తుడ్చు కుంటూ ''రొడ్డోల్లు... రొడ్డోల్లు'' అంటూ ఏడుపు కొన సాగిస్తున్నాడు.

''ఓహో! నూకూర్చో. బజారీ!.... ఏం జరిగిం దిరా...'' ఒక పెద్ద పిల్లోణ్ణి అడిగాడు కాశి.

''ఇగో! వాల్ల నాయన బడికట్టే పనికి రాకుండ రైలుకట్ట పనికి పోయినడు. దుడ్లొస్తయ్ అని. అందు కనీ... రొడ్డోల్లు పిల్చి...'' పిల్లవాడు ఇంకా పొడిగిస్తుంటే ఆపేసి, ''సరే నూ కూర్చో,'' అన్నాడు. కారణం కాశికి పూర్తిగా అర్థమైంది. కాశి నాకు మిగిలిందంతా ఇంగ్లీషు లో చెప్పాడు. విషయం వింటుంటే విషం మింగి నట్లుంది. రాయలసీమలో రెడ్లు తమ పేర్లకు ముందు పులిబిడ్డలు, తోడేళ్లు అని రాసుకోవడమే కాదు నిజంగా చేసి చూపిస్తున్నారని ప్రత్యక్షంగా అర్థమైంది. ఆ పిల్ల వాణ్ణి దగ్గరగా పిల్చి పేరడిగాను. చెప్పలేదు. సంచి లోంచి కెమెరా తీశాను. ''ఒకసారి నవ్వు. నీ ఫోటో తీస్తాను,'' అన్నాను. ఫ్లాష్ లైటింగ్‌కి నవ్వాడు. ''యిప్పుడు చెప్పు నీ పేరు...'' అడిగాను.

''కిష్టిగాడు''... చెప్పాడు.

''మీ నాయన పేరు...'' అడిగాను.

''ఎర్రమద్ది''... పేరు నాకు నచ్చింది. జన్మభూమి ప్రోగ్రాం క్రింద రెడ్డి కట్టిస్తున్న బడికి కూలీ లేకుండా పనిచేసే కట్టడిపెడితే కాదని కూలికోసం రైల్వే బ్రాడ్‌గేజి పనికిపోయిన 'ఎర్రమద్ది' నిజంగానే గొప్పవాడనిపిం చింది నాకు. ఇద్దరం భోంచేసి మిద్దెక్కినాము.

''కాశీ!... ఇంతకీ ఆ స్కూలు స్థలం... అంగన్‌వాడీ స్థలం రెడ్డి యిచ్చాడా...'' అడిగాను.

''యివ్వడం... అది వాళ్ల ఇంటావంటా లేని అల వాటు. ఒకే ఒక కలంపోటుతో వేరేవాళ్ల స్థలాలు లాక్కో వడమేగాని స్థలాలు దానం చేయడం... కలలో కూడా జరగదు. ఆ స్కూలు స్థలం అయిదెకరాలు ఒక కురువ కుటుంబానిది. అన్నదమ్ముల మధ్య పేచీ వచ్చింది. రెడ్డి దగ్గరికి పంచాయితికొచ్చారు. చాలాసేపు వాదులాట జరిగింది. చివరికి రెడ్డి, 'రేయ్! ఇదేం బాగాలేదుగాని యిద్దరు గలిసి ఆ చేను బడికి రాసియ్యండి పొండి,' అని ఆర్డరేశాడు. అంతే స్థలం రిజిస్టర్ అయింది. స్కూలు భవనం శంకుస్థాపనలోగాని, భవన నిర్మాణ శిలా ప్రతిష్ఠాపనలో గాని వాళ్ల పేర్లు లేవు. స్థలదాత 'బైసాని వెంకటసుబ్బారెడ్డి, గ్రామ విద్యాకమిటి ఛైర్మన్' అని తాటికాయంత అక్షరాలతో చెక్కించారు. చూసి అన్నదమ్ములిద్దరూ గుటకలు మింగడం తప్ప ఏం చేయలేదు. ఆపై ఒక వాలంటరీ సొసైటీ పెట్టించాడు. దాని పేరు మీద వసూలైన లక్షలలో నుండి 30 శాతం పడేశాడు. స్కూలు నిర్మాణానికి పదిలక్షలు శాంక్షన్ అయ్యాయి. కాని దానికి యిసుక కవాడికొండవాళ్లు, రాయి కనకదిన్నెవాళ్లు, సిమెంటు ఒంటిమిట్టవాళ్లు ఫ్రీగా లారీలతో దింపారు. కూలీ లేకుండా ఊరిలో ఇంటి కొక్కరు వచ్చి శ్రమదానం చేశారు. పేరుకు పేరు డబ్బుకు డబ్బు. 'ఫ్యాక్షన్ వీడి చదువుల తల్లి బడికి' పేపర్లో వార్తలు.'' కాశీ కథ చెబుతుంటే విఠలాచార్య సినిమా గుర్తొచ్చింది నాకు. వేలికున్న ఉంగరం రుద్దితే ధన్‌మని రాక్షసుడు ప్రత్యక్షమై హీరోగారికి అన్నీ అమర్చి నట్లు, రెడ్డిగారు ఫ్యాక్షన్ రింగు రుద్దితే చాలు అరచేతిలో వైకుంఠం ప్రత్యక్షమైతుంది.

నాకు రాత్రంతా నిద్రపట్టలేదు. ఎర్రమద్దిని చూడాలనిపించింది. మాట్లాడాలని మనసులో తపన. తెల్లారింది. స్నానమైంది. ''ఓయ్! రెడ్డి దగ్గర నేజెప్పిన వన్నీ ఎత్తకు. జాగ్రత్త సుమా'' కాశీ వార్నింగ్ ఇస్తుంటే, ''ఓయ్ జర్నలిస్టుకే చెప్పొచ్చావా... అవన్నీ మాకు తెల్సులేవై!...'' అంటూ రెడ్డి దగ్గరికి బయల్దేరా.

*

మూడంతస్తుల మేడ. పైన పెద్ద డిష్ గిన్నె... సింటెక్స్ ట్యాంక్. మూడో అంతస్తు నుండి బొచ్చుకుక్క మొరుగుతోంది. కర్నూల్లో ఒక క్లాసికల్ ఏరియా నుండి తెగిపడిన అపార్ట్‌మెంట్‌లాగా ఉంది ఆ బంగళా.

గేటు దగ్గరే, ''ఎవరు... ఎవరు కావాల,'' ప్రశ్న లకు సమాధానం చెప్పాను. ''రొడ్డి పూజ చేత్తున్నడు యీడగూసో,'' ఒక జులపాలాయన కుర్చీ చూపించాడు. చాలా కొద్దిమందే కుర్చీల్లో కూచున్నారు. గుంపులు గుంపులుగా అక్కడక్కడ మాట్లాడుకొంటున్నారు. టాటాసుమో, జీపులు వరుసగా ఆగి ఉన్నాయ్. నలు గురైదుగురు పిల్లలు హాలీడే డ్రస్సుల్లో క్రికెట్ ఆడు

కుంటున్నారు. నేను కూర్చున్న హాల్లో పెదరంగారెడ్డి ఫోటో, సుబ్బారెడ్డి ముఖ్యమంత్రితో, రాష్ట్రపతితో దిగిన ఫోటోలు షోకేసుల్లో నుండి తొంగి చూస్తున్నాయ్.

చాలాసేపటికి ఒక పిల్లవాడు యాష్‌ట్రే తెచ్చి టీపాయ్ మీద పెట్టాడు. ఫ్రిజ్ బాటిల్ తెచ్చి పెట్టాడు. కుర్చీల్లో వాళ్లకు టీ వచ్చింది. అందరితోపాటు నేనూ తాగాను. యాష్‌ట్రే... రాగానే- అందరూ మాటలు ఆపి లోపలికి చూడడం మొదలుపెట్టారు. పేపర్లు చదువు తున్న వాళ్లు అవి మడతపెట్టి సిద్ధంగా కూచున్నారు.

రంగంలోకి వెంకటసుబ్బారెడ్డి ప్రవేశించాడు. ఒక్క ఉదుటున అందరూ లేచి అప్రయత్నంగా నమ స్కారాలు పెట్టేశారు. నేనూ అదే చేసినా... సింహాసనం లాంటి తన కుర్చీలో సుబ్బారెడ్డి దేహం నిండుగా వుంది.

"ఏరా... దయ్యందిన్నె బాయోల్లు వచ్చినారా?" ఎవర్నో అడిగాడు.

చేతులు కట్టుకున్న ఒకాయన, "వచ్చినార్రొడ్డి... ను ఫోన్ జేస్తే ఆటికి బోతం రొడ్డి," అన్నాడు. "ఆ! మీరు ఎస్.ఐ. దగ్గరికి పోండి. నేను ఫోన్ చేస్త," అతని వెంట ఒక గుంపు వెళ్లిపోయారు.

రెడ్డి ఫోన్లో... "నమస్తే, అవునవును... రాత్రి లేటాయె. తీస్కోని పోయినారు... అవును... వాళ్లు వస్తున్నారు... లేదు... లేదు... వాళ్లిద్దర్ని... ఆ! పంపి చ్చెయ్యి... ఉంటమల్లా..." ఆ పదాలతోనే ఏం మాట్లా డాడో అందరికీ బాగా అర్థమైపోతుంది. ఇంకొకాయన వచ్చి నెత్తిగీరుతూ నిలబడినాడు... "ఏరా... కాదురా... ఎస్.పి. సంగతి తెల్సుగదా మీకు. మల్ల ఎవడ్రావాడు... అట్ల జేసినోడు. ఏం మీరంతా వూరిడ్సాలనుకుంటు న్నారా! మీ వూరిదెప్పుడిదే పాడు పంచాయితీ. ఇగో కరి పండగనాడు మొండోడు, సత్తిగాడు ఇద్దరిని ఉండొద్దని చెప్పు," సిగరెట్ పట్టుకున్న రెండు వేళ్లతో రెడ్డి వార్నిం గిచ్చాడు. "సరే! రెడ్డి," అంటూ తల ఊపుతూ వాడు వెళ్లిపోయాడు.

నావైపుకు దృష్టి మలిచాడు. నాకు అప్పుడే మాట్లాడి వెళ్లిపోవాలని లేదు. చాలా యింట్రెస్టింగ్‌గా ఉంది. వినడానికి, చూడడానికీ...

"మీరు... చెప్పండి," అన్నాడు నాతో.

"నేను 'జనవాణి' అని ఒక మాసపత్రికలో పని చేస్తున్నాను." విజిటింగ్ కార్డిచ్చాను. "జన్మభూమి గురించి సమీక్ష రాస్తూ మీ వూరిలో జరిగిన ప్రోగ్రెస్ గురించి రాయాలనుకున్నాం. అట్లే మీతో ఇంటర్వ్యూ తీసుకుందామని..." పొడిపొడిగా మాట్లాడినా.

ఖద్దరు ఫుల్ షర్టును మడతలు పెడుతూ... "మీరు పేపర్లలో చదివే ఉంటారుగదా! మేము ప్రత్యక్షంగా చెప్పేదేముంది. మేము ఒక వాలంటరీ సొసైటీ తరపున ఊళ్లో చాలా పనులు చేపట్టినాం. హైస్కూలు, అంగన్‌వాడి, రోడ్లు... రేయ్ నర్సి... మనవి ఆ జన్మభూమి ఫోటోలు తెచ్చియ్యి," అన్నాడు.

"జన్మభూమి గురించి మీ అభిప్రాయం..." అన్నాను.

"జన్మభూమి చాలా బెస్ట్ ప్రోగ్రాం... కంట్రాక్టర్లకు తినబెట్టకుండా ప్రజలే ముందుకు వచ్చి శ్రమదానంతో అన్నీ నిర్మించుకోవడం... అసలు ఇది మొత్తం దేశానికే ఆదర్శం కదా..."

"అంటే దీనిలో కంట్రాక్టర్ల ప్రమేయం ఏమీ లేదంటారా?" అడిగాను.

"లేదు. ముఖ్యంగా మా ఊరు ఒకప్పుడు ఫ్యాక్షన్ తో ఉడికిపోయింది. జన్మభూమిలో అందరూ కలిసి కట్టుగ పనిజేసినారు. బడి కట్టుకున్నారు. నీరు మీరులో పూడికలు తీస్కున్నారు. ఇప్పుడు ప్రశాంతంగా బత్కు తున్నారు," అన్నాడు.

ఇంతలో ఒక జీప్... నిండా జనం దిగారు. "రేయ్... ఆ దండోరా వాళ్ల జీపు వచ్చినట్లుంది.... ఇద్దర్ని మాత్రమే లోపలికి పంపు..." అన్నాడు.

"సరే... నేను వెళ్తానండి..." లేచాను.

"పత్రిక ఏదన్నారు?" అడిగాడు రెడ్డి. పత్రిక పేరు చెప్పి బయటపడ్డాను.

*

"ఓన్నా... రాత్రి ఫోటో దీస్తివి గద ఎప్పుడిస్తవు..." కాశి ప్రైవేటు పిల్లవాడు ఒకడు వచ్చి అడిగాడు.

"అదా... అది మీ సారుకిస్తగానీ, మీకిష్టిగాని ఇల్లు చూపిస్తవా," అన్న. ఎర్రమద్దితో మాట్లాడాలని.

"అగో.... ఆ సింతమాను పక్కన ఉండే తడిక వాకిలిల్లే..." పిల్లాడు చూపించాడు. "పోదాం రా," పిల్చు కునిపోయాను. కిష్టిగాడు నన్నుచూసి పరుగెత్తుకొచ్చాడు. కెమెరా ఉన్న నా సంచీనే చూస్తున్నాడు. నవ్వు తున్నాడు.

"ఎవరు నాయనా..." కిష్టిగాని అమ్మ లోప ల్నుంచి తొంగిచూసింది.

"అగో... ఈయన... మా సారు వాళ్లింటికి వచ్చినాడు. నిన్న పోటో తీసినాడని చెప్తి కదా... ఈయనే తీసినేది," కిష్టిగాడు చెప్పాడు.

''ఓహో! అంటే ఫోటోలు తీసేటాయన కదా... కూచ్చో నాయనా...'' కిష్టి వాళ్లమ్మ అరుగు చూపించింది. నేను స్టూడియో వాడిలాగా అనుకోబడడం... మేలే అన్పించింది.

''కొంచెం మంచినీళ్లియ్యమ్మా...'' అన్నాను.

''వ్యానుకు పోవాలేమొకదా నాయినా... కూచో వస్తదిలే...'' ఆమె చాలా ఆప్యాయంగా మాట్లాడింది. మంచినీళ్లు తాగుతూ, ''ఎట్లుందమ్మా వీళ్ల నాయనకు. ఏదో దెబ్బలు తగిలాయని చెప్పాడు,'' అన్నాను.

ఆమె వెంటనే చాలా జాగ్రత్తగా, ''అగో- వద్దంటే ఆ రైలుకట్ట పనికిపోయినాడు. అది మనకి అలవాటు లేని పని. గంపనెత్తుకొని ఆ రాళ్ల మీద అట్లే కూలబడి నాడంట. దెబ్బలు తగిల్నయ్. అగో మంచం మీద పడుకున్నాడు,'' అని చూపించింది.

ఎర్రమద్ది ఏం మాట్లాడలేదు. చాలా గంభీరంగా ఉన్నాడు. నేనే కలుగజేసుకుని, ''బాగుందా ఆరోగ్యం,'' అన్నాను. ''ఫోటో తీయనా ఒకటి,'' అడిగాను. కిష్టిగాడు సంబరంగా... దగ్గరికొచ్చి, ''నన్ను మా నాయనను ఒక ఫోటో తీ...'' అన్నాడు.

''వద్దు....'' ఎర్రమద్ది గదమాయించాడు. ''మాక్యాల ఫోటోలు... కూలి నా కొడుకులకు ఎచ్చు లెక్కువైంది అంటారు.'' నేను కెమెరా తీయబోయి నాను. కిష్టి వాళ్లమ్మ, ''వద్దులే నాయనా... యాదో మాకవి అచ్చుబాటురావులే,'' అనింది.

''సరే! మరి ఈ కాళ్లు చూపించుకోవడానికి డాక్టర్ దగ్గరికి పోరా...'' అడిగాను.

''పోతుండం యియ్యాల.... అక్కడ వేరే దేశం... పరమటికి పోతం...'' అంటుందామె.

''అంత దూరం ఎందుకు?'' అడిగాను.

ఆమె అందుకుంది, ''ఏం జేస్తం నాయనా- కడుపు కాలినోల్లం. మీ లెక్క ఉన్న మారాజులమా... కడుపు పట్కోని యాడ యింత ముద్ద దొర్కితే ఆడికి పోతాం. యాదో యిన్నాల్లు మా రెడ్డోల్ల పున్నెమా అని బత్కినం,'' కొంత వణుకుతున్న గొంతుతో ఆమె చెప్తోంది.

''మరిప్పుడేమైంది...'' నేనందుకున్నాను.

''ఎన్నాళ్లని... ఊర్లో పంటలు లేవు. పనులు లేవు. మొత్తం మా మాదిగ కుటుంబాలన్నీ బత్కనీక పోతుం డయ్,'' చెప్పిందామె.

''ఎందుకు జన్మభూమి పేరు మీద మీ వూర్లో పనులు బగానే జరుగుతున్నయ్ గదా...'' అడిగాను.

''దాండ్లతో మా కడుపు నిండదులే నాయినా...'' ఆమె అంటుండంగా ఊర్లో ఏదో దండోరా మొదలైంది.

''ఊర్లో యావన్మందికి తెలియజేయడమేమనగా ఈనెల 26వ తేదీ మన వూరిలో కలెక్టర్ మీటింగ్ వుంది. మన ఊరు జన్మభూమిలో ఫస్ట్ వచ్చినందుకు మన ఊరికే బహుమానాలిస్తరు. కాబట్టి ఆరోజందరూ మీటింగ్‌కు రావాల్సిందిగా తెలియజేస్తున్నాం.'' తప్పెట మ్రోగుతోంది.

''వస్తానమ్మా,'' అంటూ నేను బస్టాండు వైపు కదిలాను. మర్రిమాను కింద ఆరోజు చాలామంది మూటలు, సామాన్లు కట్టుకొని కూచున్నారు.

''ఏరా... అందరూ మూటాముల్లె సర్దినారు,'' ఒక పెద్దమనిషి అడుగుతున్నాడు.

''బత్కనీక పోతాండం సామీ. పిల్లా జెల్లా అందరూ,'' అన్నాడొకాయన. అందరూ వ్యాన్ కోసం ఎదురు చూస్తున్నారు.

ఒక తల్లి పాలుతాగే పిల్లోని మీద విసుక్కుంది. ''ఏందిరా పొద్దుమూకులు గుంజుతున్నావ్. ఏదుందని... నాకాడ సారముంటేనా... నూ తాగేది,'' కొంగుమూసి పసిపిల్లోన్ని బుజ్జగిస్తోంది.

*'కథా సమయం' కథల సంకలనం, జూలై 2001*